సాక్షి
నిర్మల్

సోమవారం ǀ 30 ǀ సెప్టెంబర్ ǀ 2024



దసరాకు ఆర్టీసీ సిద్ధం

దసరా సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపనుంది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 412 బస్సులు తిప్పనున్నారు. 8లో ▸

ఉమ్మడి ఆదిలాబాద్ రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.రవీందర్‌రావు నియామకం అయ్యారు. ఇదివరకు డీఆర్‌గా పనిచేసిన అశోక్‌కుమార్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో హైదరాబాద్ దక్షిణ డీఆర్‌గా ఉన్న రవీందర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

గరిష్టం/కనిష్టం
33.1 /25.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట వేడి, ఉక్కపోత ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో రవీందర్, సీఐలు

భైంసాటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.రవీందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఖేలో ఇండియా వుషూ కేంద్రంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–14 రెజ్లింగ్ విభాగంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పట్టణ, రూరల్ సీఐలు గోపినాథ్, నైలు నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక ధృడత్వంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ డీవైఎస్‌వో శ్రీనివాస్, ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి రమణారావు, పీఈటీ బుచ్చి రామారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కులవివక్షత నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న రాజు

భైంసారూరల్: కులవివక్షత నిర్మూలనకు కృషి చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు అన్నారు. ఆదివారం మండలంలోని హంపోలి గ్రామంలో కులవివక్షత నిర్మూలన సభలో పాల్గొని మాట్లాడారు. నేటికీ సమాజంలో కులం పేరిట అణిచివేత, అంటరానితనం, దాడులు జరుగుతున్నాయని.. కులవివక్షత నిర్మూలనకు సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో ముందుకెళ్తామని పేర్కొన్నారు. మండలంలోని హంపోలి గ్రామంలో ప్లాట్ల పంపిణీ జరగడం లేదన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ భైంసా డివిజన్ నాయకులు సాయినాథ్, సురేశ్, బాబు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం రమాదేవి, పీడీ సచ్చేందర్ తెలిపారు. దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో ఈ నెల 27న నిర్వహించిన అండర్–17 వాలీబాల్ పోటీల్లో పదోతరగతి విద్యార్థి మస్తాన్, ఈ నెల 28న దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో జరిగిన అండర్–14 కబడ్డీ పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థి బన్నీ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులతో పాటు తోటి విద్యార్థులు అభినందించారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. గురుస్వామి కడార్ల హరిప్రసాద్, అర్చకుడు నగేష్ ఆధ్వర్యంలో గజ్జలమ్మ దేవికి అభిషేకం, అలంకరణ, పల్లకీ సేవ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

నిర్మల్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైరి మహేందర్, గౌరవ అధ్యక్షుడిగా మిట్టపల్లి నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా పి. సదానందం, కోశాధికారిగా వై.సాయన్న, రాష్ట్ర కౌన్సిలర్లుగా సంధ్యారాణి, జి.మైసజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు పనిచేస్తుంది.

నవ సంఘర్షణ సమితికి రాజీనామా

నిర్మల్‌టౌన్: నవ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు మెరుగు మధుకర్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి నవ సంఘర్షణ సమితికి, తమకు, సోమవారం జరిగే సత్యాగ్రహ దీక్షకు కూడా ఎలాంటి సంబంధం లేదన్నారు.



రైస్‌పై రికవరీ యాక్ట్!

- 'మిల్లులు' మింగింది.. రూ.100 కోట్లపైనే
- ఇప్పటికే ఏడు రైస్‌మిల్లులపై కేసులు
- ఇక వాటి నుంచి రికవరీకి సమాయత్తం
- సీఎంఆర్‌పై సీరియస్‌గా అధికారులు

నిర్మల్: సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)లో రికవరీ కావాల్సిన లెక్క రూ.వందకోట్లకు పైగా తేలింది. జిల్లాలో ఏడు రైస్‌మిల్లులు మర ఆడించి ఇవ్వాల్సిన ధాన్యాన్ని మాయం చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఇప్పటికే జిల్లా అధికారులు సదరు మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఒక్కో రైస్‌మిల్లు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు ధాన్యాన్ని మాయం చేసినట్లు తేలింది. ఇక జిల్లా అధికారులు వాటి నుంచి చేయాల్సిన రికవరీపై దృష్టి పెట్టారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఇప్పటికే పలు జిల్లాల్లో మిల్లర్ల ఆస్తుల వేలం పాటలనూ చేపడుతున్నారు. జిల్లాలోనూ ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సీఎంఆర్ విషయంలో సీరియస్‌గా ఉన్న ప్రభుత్వం, రాష్ట్రస్థాయి అధికారులు సైతం జిల్లాలో మిల్లర్ల మాయాజాలంపై ఆరా తీస్తున్నారు.

రూ.వంద కోట్లపైనే..

జిల్లాలో సీఎంఆర్‌లో వెలుగులోకి వస్తున్న కథలు ఈ ఒక్క సీజన్‌కు సంబంధించినవే కాదు.. కొన్ని మిల్లులు 2021–22 రబీ నుంచే సీఎంఆర్ ఇవ్వకుండా ధాన్యాన్ని మాయం చేస్తూ వస్తున్నాయి. 2022–23 ఖరీఫ్, రబీపంటల ధాన్యాన్నీ అమ్మేసుకున్నాయి. జిల్లాలో మొత్తం 64 మిల్లులకు గానూ 32 మిల్లులను డిఫాల్ట్‌గా గుర్తించిన అధికారులు అందులో ఏడు మిల్లులు మాత్రం సీఎంఆర్ ఇవ్వకుండా, ధాన్యాన్ని లేకుండా చేసినట్లు తేల్చారు. భైంసా మండలం దేగాంలోని రాజరాజేశ్వర రైస్‌మిల్లు, సారంగపూర్ మండలం బీరవెల్లిలోని సాయికృప రైస్‌మిల్లు, బాసరలోని అక్షయరెడ్డి ఇండస్ట్రీస్, లోకేశ్వరం మండలం జోహార్‌పూర్‌లో గల రాజరాజేశ్వర రైస్‌మిల్లు, ధర్మోరాలోని శ్రీవెంకటేశ్వర రైస్‌మిల్లు, సారంగపూర్ మండలం చించోలి(బి)లో గల అన్నపూర్ణ ఆగ్రో ఇండస్ట్రీస్, ముధోల్ మండలం చింతకుంటలోని జశ్విత రైస్ ఇండస్ట్రీస్.. ఈ ఏడు మిల్లుల్లో కలిపి దాదాపు రూ.110 కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈక్రమంలోనే ఈ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారు.

వడ్డీతో సహా చెల్లించాల్సిందే..

బియ్యాన్ని ఇవ్వాల్సిన రైస్‌మిల్లులు ఆ ధాన్యాన్నే మింగేయడంపై సర్కారు సీరియస్‌గానే స్పందిస్తోంది. ఈమేరకు జిల్లా అధికారులు సైతం చర్యలను వేగవంతం చేస్తున్నారు. జిల్లాలో గత మూడు సీజన్ల నుంచి సీఎంఆర్ ఇవ్వకుండా డిఫాల్ట్‌లో పడ్డ మిల్లర్ల నుంచి వడ్డీతో సహా వసూలు చేసేందుకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. మూడు సీజన్‌లలో కలిపి దాదాపు రూ.107 కోట్లకు పైగా మిల్లర్లు బాకీ పడగా, అది వడ్డీతో రూ.110 కోట్ల వరకు వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని మిల్లులు రూ.20 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రికవరీ యాక్ట్ దిశగా అధికారులు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

రికవరీ యాక్ట్ దిశగా..

జిల్లాలో గడువుదాటినా బియ్యమివ్వని, ధాన్యాన్ని మాయం చేసిన ఏడు మిల్లులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ముందుకు వెళ్లేందుకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే మెదక్, నల్గొండ, తదితర జిల్లాల్లో ఇలాగే సీఎంఆర్‌లో అవకతవకలకు పాల్పడిన మిల్లులపై రికవరీ యాక్ట్ పెట్టారు. జిల్లాలో ఇదే దిశగా అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పౌరసరఫరాలశాఖ సిద్ధం చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే..అక్కడి నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్ల వద్దకు చేరుతాయి. యాక్ట్ ప్రకారం మిల్లర్ల ఆస్తులను లెక్కించి వేలం దిశగా చర్యలు తీసుకుంటారు. ఇటీవలే మెదక్ జిల్లాలో రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తుల వేలం చేపట్టారు.

ఆరా తీస్తున్న అధికారులు..

సీఎంఆర్‌లో మిల్లర్ల మాయాజాలంపై జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వమూ సీరియస్‌గా చర్యలు చేపడుతోంది. ఈక్రమంలో పౌరసరఫరాలశాఖ రాష్ట్ర అధికారులు, సైతం జిల్లాలో ధాన్యం మిల్లింగ్‌లో అవకతవకలపై ఆరా తీస్తున్నారు. జిల్లా అధికారులను ఎప్పటికప్పుడు ఫాలో చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై ఇప్పటికే కేసులు పెట్టడంతో పాటు రికవరీ కోసం ప్రతిపాదనలు చేయనున్నట్లు అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు.

'గంగమ్మ'పై పట్టింపేది?

- దాత ఏర్పాటుచేసిన విగ్రహంపై నిర్లక్ష్యం
- రంగులు కూడా వేయించని అధికారులు



రంగువెలిసిన గంగమ్మతల్లి విగ్రహం

భైంసా: బాసర అనగానే అందరికీ గుర్తొచ్చేది జ్ఞాన సరస్వతీ అమ్మవారు. దీంతోపాటు మహారాష్ట్రలోని నాసిక్‌లో పుట్టిన గోదావరి తెలంగాణలో ప్రవేశించే స్థానం కూడా బాసరనే. అందుకే బాసరను పవిత్ర స్థలంగా, గోదావరి నాభిస్థానంగా భావిస్తారు. వ్యాసుడు దీక్షతో గోదావరి సమీపంలో కొన్నేళ్లపాటు ఇసుకను వేయడం ద్వారా సరస్వతీ దేవి పూర్ణ రూపం ఏర్పడింది. దీనికోసం అమ్మవారు వ్యాసుడి అమ్మవారు జ్ఞాన బీజం ఉపదేశించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకే సరస్వతీ అమ్మవారిని ఇక్కడ జ్ఞాన సరస్వతిగా కొలుస్తారని ప్రతీతి. దేశంలో అనేక సరస్వతీదేవి ఆలయాలు ఉన్నా.. బాసరలో మాత్రమే జ్ఞాన సరస్వతీ అమ్మవారు కొలువై ఉన్నారు. గోదావరి ఇసుకతో అమ్మవారి రూపం ఆవిష్కృతమైనందున ఇక్కడి గోదావరినీ పరమ పవిత్రంగా భక్తులు భావిస్తారు. ఇక్కడి నుంచి నీటిని తీసుకెళ్లి గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేస్తారు.

గంగమ్మ విగ్రహం ఏర్పాటు..

ఇక గోదావరి ఒట్టున గంగమ్మను పూజించేలా నిజామాబాద్‌కు చెందిన వ్యాపారి కుదీప్ సహాని బాసర గోదావరి ఒడ్డున గంగమ్మ తల్లి విగ్రహ నిర్మాణానికి ముందుకు వచ్చాడు. గోదావరి పుష్కరాల సమయంలో విగ్రహం నిర్మించి బాసర ఆలయ నిర్వాహకులకు అప్పగించాడు. అప్పటి నుంచి గోదావరికి వచ్చిన భక్తులు గంగమ్మను పూజిస్తున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం..

పవిత్ర స్థలంలో నిర్మించిన గంగమ్మతల్లి విగ్రహాన్ని ఆలయ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. రంగులు కూడా వేయించడం లేదు. ఇక గంగమ్మ తల్లికి భక్తులు సమర్పించే నైవేద్యాలు సమీపంలోనే పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది.

ఈ ఉత్సవాల్లోనైనా..

అక్టోబర్ 2 నుంచి బాసరలో దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. గోదావరి నదిలో ఉన్న ఇసుకతోనే జ్ఞాన సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని వ్యాసమహార్షి ప్రతిష్ఠించిన చరిత్ర తెలిపేలా ఎక్కడ ఏర్పాట్లు లేవు. గంగమ్మ తల్లి ఒడి నుంచి ఇసుక తీసుకువచ్చిన పుణ్యప్రదేశాన్ని భక్తులందరికీ తెలిసేలా ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా బాసరకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. ఈ సందర్భంగా అయినా గంగమ్మ విగ్రహానికి రంగులు వేయించాలని పలువురు కోరుతున్నారు. జ్ఞాన సరస్వతీదేవి, గంగమ్మ చరిత్రను తెలిపేలా లైటింగ్ ఏర్పాటు చేయాలంటున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతపై ఆందోళన



విద్యుత్ సిబ్బందిని నిలదీస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మేడంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మామడ మండలం వెంకటాపూర్ గ్రామానికి రాత్రి వేళల్లో తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సుమారు 50 మందికిపైగా గ్రామస్తులు శనివారం రాత్రి మేడంపల్లికి చేరుకుని సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని నిలదీశారు. గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరా నిలిపివేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చీకట్లో దోమలతో సహవాసం చేస్తున్నామని, చిన్నపిల్లలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇటీవల ఒకరు అనారోగ్యంతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దేవా, గణేశ్, రమేశ్, ప్రకాశ్, నరేందర్, కుమార్, పండిత్, భీంరావు, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మిల్లును పరిశీలిస్తున్న సెర్ప్ డైరెక్టర్, డీఆర్డీవో

కడెం: స్వయం సహాయక సంఘాల మహిళలు సెర్ప్ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సెర్ప్ ఫార్మ్ డైరెక్టర్ రజిత, డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇప్ప పరక నూనె మిల్‌ను పరిశీలించారు. అనంతరం కడెం ప్రాజెక్ట్ దిగువన ఉన్న ఫిష్ ఫార్మ్‌ను సందర్శించారు. కొన్నేళ్లుగా నిర్వహణ లేక వృథాగా వదిలేసిన ఫిష్ ఫార్మ్ ద్వారా గంగపుత్ర సంఘ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కడెం ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారాం, ఏపీవో జయదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని, ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో కరాటే నేర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్స్‌లో చుక్క ధర్మరాజు మెమోరియల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. 8 నుంచి 32 సంవత్సరాల వయస్సుగల క్రీడాకారులు దాదాపు 1200 మంది పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. టోర్నమెంట్ చీఫ్ జడ్జ్ రాపోలు సుదర్శన్, కరాటే అసోసియేషన్ నాయకులు తేజేందర్ సింగ్, కొండాజి శ్రీకాంత్, భూషణ్, సాయికృష్ణ, మృణాళిని, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులంతా ఏకంకావాలి



ఐక్యత చాటుతున్న తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారులంతా పార్టీలకు అతీతంగా ఏకం కావాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో టెంట్ల కింద కూర్చొని, జైలుకు వెళ్లి ఉద్యమించిన వారిని గుర్తించి కమిటీలు వేస్తున్నామన్నారు. కొంతమంది తాము ఉద్యమకారులమంటూ రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేసి, గుర్తింపు పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. మేమంతా తెలంగాణ కోసం లాఠీ దెబ్బలు తిని జైలుపాలయ్యామన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, నాయకులు ప్రశాంత్, చాకటి కిరణ్, డాక్టర్ కృష్ణంరాజు, సాయన్న, దేవేందర్, హరీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య 'ప్రశస్త్'



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈవో (ఫైల్)

- చిన్నారుల శారీరక, మానసిక లోపాల గుర్తింపునకు కసరత్తు
- 'ప్రత్యేక యాప్ రూపకల్పన
- ఉపాధ్యాయులకు శిక్షణ

నిర్మల్‌ఖిల్లా: ప్రతీ తరగతి గదిలో విద్యార్థుల నేపథ్యం, వారి శారీరక, మానసిక స్థాయి తెలుసుకుని బోధనాభ్యసన ప్రక్రియ చేపడితే ఫలవంతంగా ఉంటుందని ఆశించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాలను పరిశీలించేందుకు కసరత్తు చేస్తున్నాయి. పాఠశాలలకు వస్తున్న విద్యార్థుల్లో చాలామంది శారీరక, మానసిక అభ్యసన వైకల్యాలు కలిగి ఉన్నారని, మరికొందరు గుర్తించలేని అంతర్గత లోపాలు, అనారోగ్య సమస్యలతో ఉంటున్నారని విద్యాశాఖ భావిస్తోంది. ఇలాంటి వారి వివరాలు సేకరించేందుకు ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్) అనే సంస్థ ప్రత్యేకంగా 'ప్రశస్త్' పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే తరగతుల వారీగా విద్యార్థులను పరిశీలించి వివరాలు నమోదు చేయాలి. ఇలా నమోదు చేసిన వారిలో సమస్యలు ఉంటే ఉన్నత స్థాయి వైద్య చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా మండలాల నుండి ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్‌లకు రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక నిపుణులతో శిక్షణ కార్యక్రమం చేపట్టింది. రిసోర్స్ పర్సన్లు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.


జిల్లాలో ఇలా...

జిల్లాలో 842 ప్రభుత్వ, 192 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలను ప్రశస్త్ యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పేరు, మెయిల్ ఐడి, మొబైల్ నంబర్, స్కూల్ యుడైస్ కోడ్‌తో లాగిన్ కావాలి. అందులో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

సర్వేలో రెండు భాగాలు...

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రశస్త్ శిక్షణ పూర్తయ్యాక కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. దీనిని రెండు భాగాలుగా విభజించారు. పిల్లలను స్క్రీనింగ్ చేసేటప్పుడు ఉపాధ్యాయులు కొన్ని ప్రశ్నలను పిల్లల్ని అడిగి తెలుసుకోవాలి. మరికొన్ని అంశాలను నిశితంగా పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది

- పార్ట్–1ను అక్టోబర్ 26 లోగా పూర్తి చేయాలి. ఇందులో 64 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపర్చాలి. బోధన అభ్యసన ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు విద్యార్థి స్థితి ఏవిధంగా ఉంది.. అతని భాగస్వామ్యం, వినికిడి, దృష్టి, ఏకాగ్రత, అవయవలోపం, ప్రతిస్పందనలు, తడబాటు, మానసిక వైకల్యం వంటి అంశాలను సూక్ష్మంగా గమనించి నమోదు చేయాల్సి ఉంటుంది.
- పార్ట్–2లో భాగంగా అక్టోబర్ 27 నుంచి నవంబర్ 14 వరకు చేపడుతారు. ఇందులో ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు బోధించే స్పెషల్ టీచర్లు లోపం ఉన్న వారిని మరోమారు పరిశీలించి ఆ లోప నిర్ధారణ కోసం సంబంధిత వైద్య నిపుణులకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది.



వివరాలు పొందుపరిచే 'ప్రశస్త్' యాప్

విద్యార్థుల లోపాలను గుర్తించేందుకే...

జిల్లాలోని పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సంబంధించిన శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, అవయవలోపాలు, ప్రజ్ఞ లోపం ఉన్న వారిని గుర్తించి వారికి నిర్ధారణ అనంతరం వైద్యం లేదా తగిన చికిత్స కార్యక్రమాలను అందించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టనున్నాయి. పేదరికంతో తల్లిదండ్రులు తగిన చికిత్స చేయించలేని పరిస్థితులు ఉన్నవారికి ఈ కార్యక్రమం ప్రయోజనం చేకూర్చనుంది. ఎక్కువ సమస్యలున్నవారికి ప్రత్యేక విద్యను అందించేందుకు కూడా అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే నేరుగా విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పూర్తిస్థాయి ఆరోగ్యవంతుడిగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తోంది..

వందశాతం నమోదు చేస్తాం



ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థుల సమగ్ర వివరాలు వందశాతం నమోదు చేస్తాం. ఇప్పటికే మండలాల వారీగా రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ పూర్తయింది. ప్రస్తుతం ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని పాఠశాలల వారీగా విద్యార్థుల నమోదు కోసం సన్నద్ధమవుతున్నాం. విద్యార్థుల లోపాలకు సంబంధించిన సమగ్ర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. వాటిని రాష్ట్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

– నూగురి ప్రవీణ్‌కుమార్, జిల్లా సమన్వయకర్త

క్లుప్తంగా

మద్యం మత్తులో ఆత్మహత్య

భైంసారూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పాంగ్రి గ్రామానికి చెందిన రాంకూరే గణేశ్ (26) గత రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు మద్యం తాగి కుటుంబీకులతో గొడవపడేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికివచ్చి కుటుంబీకులతో గొడవపడి చచ్చిపోతా అంటూ వెళ్లిపోయాడు. అతని కోసం వెళ్లగా గ్రామశివారులో చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. గణేశ్‌ను వెంటనే భైంసా ఏరియాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. భార్య గంగాసాగర ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడకు చెందిన లింగాల కిరణ్ కుమార్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్‌రూరల్ ఏఎస్సై మారుతి కథనం ప్రకారం.. కిరణ్‌కుమార్ (35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొన్నినెలలుగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో భార్యతో గొడవపడేవాడు. నెల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం తండ్రి శ్రీనివాస్ గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భార్య శిరీష ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి గాయాలు

తిర్యాణి:మండలంలోని బోడగూడలో ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి తీవ్ర గాయాలయ్యాయి. గోపెర ఫారెస్టు సెక్షన్ అధికారి మల్లయ్య కథనం ప్రకారం.. గిన్నెదరి రేంజ్ పరిధిలోని గోపెర సెక్షన్‌కు, కైరిగూడ బీట్ పరిధిలోని బోడగూడ అటవీప్రాంతంలో అదే గ్రామానికి మేకల కాపరి పంద్రం బగ్గు తన మేకలను మేపి శనివారం సాయంత్రం ఇంటికి వస్తుండగా పిల్లలతో కూడిన ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో బగ్గు కాలికి తీవ్రగాయమైంది. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి ప్రధాన రహదారిలో అక్రమంగా తరలిస్తున్న పశువులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కౌటాల మండల కేంద్రంతో పాటు బెజ్జూర్ మండలంలోని సలుగుపల్లి, మర్థిడి గ్రామాల నుంచి అనుమతి లేకుండా నాలుగు వాహనాల్లో 36 పశువుల ను తరలిస్తున్నారు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. వాహనాలను సీజ్‌చేసి చేసి, పశువులను అక్రమంగా తరలిస్తున్న జగిత్యాల జిల్లాలోని చిన్నకోడూరు, గొల్లపల్లి గ్రామాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, Sal:20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [G-9049]

■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీ వసతి + భోజనం. జీతం: 17K. ఫోన్: 8520874499, 8520980099 [H-796282]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

దసరాకు ఆర్టీసీ సిద్ధం

- అక్టోబర్ 1 నుంచి 11 వరకు ప్రత్యేక బస్సులు
- ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఏర్పాట్లు
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 412 సర్వీసులు



ఆదివారం మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అక్టోబర్ 1 నుంచి 11వ తేదీ వరకు నడిపేందుకు సన్నద్ధమవుతుంది. ఆయా ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. స్కూల్, కళాశాలలకు పండుగ సెలవులు ఉన్నందున ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇంకోవైపు ట్రాక్ మరమ్మతు నేపథ్యంలో రైళ్ల బంద్‌తో బస్సులను ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ రీజియన్‌లో ఆయా డిపోల నుంచి 412 బస్సులను జేబీఎస్ (హైదరాబాద్ నుంచి) ప్రత్యేకంగా నడపడానికి సన్నాహాలు చేస్తోంది.

మంచిర్యాల నుంచి ఎక్కువ బస్సులు..

పండుగ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల నుంచి ఎక్కువగా బస్సులు నడపనున్నారు. రీజియన్ వారీగా 412 బస్సులు నడపనుండగా మంచిర్యాల నుంచి 125 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. నిర్మల్ నుంచి 120, ఆదిలాబాద్ 78, ఆసిఫాబాద్ 73, భైంసా 11, ఉట్నూర్ 05 బస్సులు నడపనున్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లినవారు స్వగ్రామాలకు పయనం కానున్నారు. పండుగ వేళ ట్రాక్ మరమ్మతు పేరిట కాగజ్‌నగర్, పుష్పుల్, రామగిరి, ఇంటర్‌సిటీ రైళ్లు రద్దు చేశారు. గోరఖ్‌పూర్–కొచ్చువెల్లి, ఎర్నాకులం, శ్రీవైష్ణోదేవి–చెన్నై, కాజీపేట్–పుణె పలు వీక్లీరైళ్లు రద్దు, దారి మళ్లింపు చేశారు. ఇంకోవైపు మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళల రద్దీ పెరిగింది. ఈనేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు టికెట్లు రిజర్వేషన్లు చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో నడిచే బస్సుల కంటే ప్రత్యేక బస్సులు నడిపి ఆదాయం సమకూర్చునేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. జేబీఎస్‌లో ప్రయాణికుల సమాచారం కోసం ఆయా డిపోల నుంచి ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

గతేడాదికంటే ఎక్కువ..

ఆర్టీసీ గతేడాది కంటే ఈ ఏడాది పండుగకు అదనంగా బస్సులు నడపనుంది. గతేడాది సెప్టెంబర్ 13 నుంచి 22 వరకు 404 బస్సులు నడపగా, ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి 11 వరకు 412 బస్సులు ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనున్నారు. గతేడాది మంచిర్యాల నుంచి 116, నిర్మల్ నుంచి 108 ఆదిలాబాద్ నుంచి 87 బస్సులు నడపగా ఈ ఏడాది కాస్త బస్సుల సంఖ్య పెంచారు.

డిపోల వారీగా..అక్టోబర్ 1నుంచి 11 తేదీ వరకు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	మంచిర్యాల	ఆసిఫాబాద్
1	6	1	12	0	15	6
2	2	0	5	0	4	3
3	3	0	5	0	5	3
4	2	0	5	0	4	3
5	12	2	16	1	18	11
6	5	1	8	1	6	6
7	4	0	5	0	7	3
8	3	0	5	0	4	3
9	12	2	16	1	18	11
10	13	2	18	1	20	11
11	16	3	23	1	24	13

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా..



దసరా పండుగ వేళ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సులు నడపనుంది. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ బస్సులు నడపనున్నాం. ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా ఆయా బస్‌స్టేషన్ల వద్ద సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బంది నియమించాం. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

– సోలోమాన్, ఆర్టీసీ రీజియనల్ మేనేజర్, ఆదిలాబాద్

ఆర్కే 5 గనిపై చోరీ

- ట్రంక్‌పెట్టెల్లో ఫోన్లు, నగదు అపహరణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిపై శనివారం రాత్రి చోరీ జరిగింది. గనిపై కార్మికులు తమ సామగ్రిని భద్రపర్చుకునే ట్రంక్ పెట్టెలను పగులగొట్టి దొరికినకాడికి దొంగలు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగించుకుని కార్మికులు వచ్చేసరికి తాళాలు పగులగొట్టి తెరిచి ఉన్నాయి. రూ.3 లక్షల విలువ చేసే సెల్ ఫోన్లు, రూ.10 వేల నగదు, కొన్ని బైక్ కీలు చోరీకి గురయ్యాయని బాధితులు గని అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎస్‌అండ్‌పీసీ అధికారుల నిర్లక్ష్యంతోనే: ఏఐటీయూసీ

ఎస్‌అండ్‌పీసీ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ చోరీలు పునరావృతం అవుతున్నాయని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని డెప్యూటీప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ షేక్ బాజీసైదా సందర్శించారు. కార్మికులకు పటిష్టమైన లాకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఫిట్ సెక్రెటరీగునిగంటి నర్సింగరావు, నాయకులు అఫ్రోజ్ ఖాన్,నాగుల రాజయ్య, సతీశ్, రమేశ్ ఉన్నారు.



పగులగొట్టి ఉన్న ట్రంక్ పెట్టెలు

పటిష్ట చర్యలు చేపట్టాలి: టీబీజీకేఎస్

గనులపై రక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కార్మికులతో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డెప్యూటీ జనరల్ సెక్రెటరీ బండి రమేశ్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, దుర్గం రవి, ముస్త్యాల రమేశ్, గొర్ల సంతోశ్, గోపి నాయక్, ఎండీ లాల ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కాసిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. 25 ఏళ్ల తర్వాత ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ సీఐడీ అడిషనల్ ఎస్పీ రవికుమార్ హాజరై మాట్లాడారు. మానవీయ సంబంధాలు మెరుగుపడాలంటే ఇలాంటి సమ్మేళనాలు ఎంతో అవసరమన్నారు. – కాసిపేట

రాంనరేశ్‌కు గవర్నర్ ప్రశంస

- జిల్లా ఉపాధ్యాయుడికి అభినందన లేఖ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా సాహితీ ఖిల్లాగా పేరుగాంచింది. తాజాగా జిల్లాకు చెందిన కవి, రచయిత, సాహితీవేత్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వకుళాభరణం రాంనరేశ్ కుమార్ సాహితీకళకు గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ ప్రశంస దక్కింది. భైంసా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఈయన 'వినరా భారతీయ వీరచరిత్ర..పేరిట దేశ చారిత్రక వీరుల కథాంశాలను శతక పద్య రూపక పుస్తకంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఇది ప్రచురణ దశలో ఉంది. త్వరలో విడుదల కానున్న పుస్తకాన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పుస్తకాన్ని ఆయన చదివి ప్రశంసించారు. సాహితీ నైపుణ్యం, జాతీయవాద చరిత్రపై రాంనరేశ్‌కు ఉన్న మక్కువపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రెండురోజుల క్రితం అభినందన లేఖను పంపారు. రాంనరేశ్ గతంలో అనేక కథాంశాలతో పలు కవితలను రచించారు.



పద్య శతక గ్రంథం ముఖచిత్రం ఇదే

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్టు

- నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు

ఆదిలాబాద్‌టౌన్: జల్సాలకు అలవాటుపడి బైక్‌లు చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను టూటౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం..ఈనెల 22న రాత్రి సమయంలో ఖుర్షీద్‌నగర్ కాలనీలోని అరార పెట్రోల్‌బంక్ నుంచి తన బైక్ చోరీకి గురైనట్లు తిర్పెల్లికి చెందిన బాధితుడు షేక్ అజీమ్ అహ్మద్ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేశారు. ఎస్సై విష్ణుప్రకాశ్, కానిస్టేబుళ్లు నరేశ్, నరేందర్, సుధాకర్‌రెడ్డి, సంజీవ్, రమేశ్, గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ మదన్, రమణయ్య ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి బైక్ అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. నేరడిగొండ మండలం బుగ్గారం తండాకు చెందిన బుక్య కృష్ణరాథోడ్ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపాడు. ఆదిలాబాద్‌లో 2, నిర్మల్‌లో 1, భైంసాలో 1 బైక్‌లు దొంగతనం చేసినట్లు పేర్కొన్నారు. ఇదివరకు కరీంనగర్‌లో 3, నిజామాబాద్‌లో 1, మెదక్ జిల్లా రామాయంపేటలో 1, కామారెడ్డిలో 1, నిర్మల్ జిల్లా కడెం, భైంసా, నిర్మల్‌లో ఒక్కొక్కటి చొప్పున బైక్‌లు చోరీ చేసినట్లు తెలిపారు. బైక్‌ల దొంగతనం కేసులో ఇప్పటికే మూడుసార్లు జైలుకు వెళ్లినట్లు వివరించారు.



నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ

బాల్‌బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర జట్టుకు తృతీయ బహుమతి



తృతీయ బహుమతి అందుకుంటున్న రాష్ట్ర జట్టు

రెబ్బెన(ఆసిఫాబాద్): హర్యానా రాష్ట్రంలోని రోతక్ జిల్లాలో జరిగిన 43వ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తృతీయస్థానంలో నిలిచినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాకు చెందిన దామర ప్రేమ్‌దీప్ రాష్ట్రజట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించటంతోపాటు పోటీల్లో అద్భుత ఆటతీరును ప్రదర్శించి జట్టు గెలుపు కోసం కృషి చేసినందుకుగాను బెస్ట్ టాప్ ఫైవ్ ప్లేయర్‌లో బెస్ట్ అవార్డును సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రేమ్‌దీప్..2023లో కర్ణాటకలో జరిగిన సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందిన సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రేమ్‌దీప్‌ను అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా జీఎం శ్రీనివాస్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింగం అభినందించారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



తల్లికి చిన్నారిని అప్పగిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని శ్రీపతినగర్‌కు చెందిన చిన్నారి సన్‌ఫిర్దోశ్(5) ఆదివారం ఉదయం కిరాణం దుకాణానికి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు 100 డయల్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఎస్సై ఆధ్వర్యంలో ఆరు పోలీసు బృందాలు గాలింపుచర్యలు చేపట్టారు. దీపక్‌నగర్ ఏరియాలో చిన్నారి సుమారు మూడున్నర గంటల తర్వాత కనిపించింది. ఎస్సై రాజశేఖర్ ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

పత్తికి సూక్ష్మపోషకాలు తప్పనిసరి

- మొక్కల ఎదుగుదలకు కాంప్లెక్స్ ఎరువులు వాడాలి
- జింక్, బోరాన్, మెగ్నీషియం అవసరం



పత్తిలో జింక్ లోపంతో రంగు మారిన ఆకులు



బోరాన్ లోపంతో ఎర్రబారిన పత్తి

చెన్నూర్‌రూరల్: పత్తి పంటకు అందించే ప్రధాన మూలకాలు లేదా పోషకాలు నత్రజని (యూరియా, డీఏపీ, కాంప్లెక్స్), పాస్ఫరస్(పి) సింగిల్ పాస్ఫేట్, పొటాష్ (మ్యూరేట్‌ఆఫ్ పొటాష్, మల్టికె కాంప్లెక్స్ అందిస్తారు. వీటితోపాటు మొక్కల ఎదుగుదల, కాయల అభివృద్ధి, పత్తి నాణ్యత, దిగుబడి పెరగడానికి జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర సూక్ష్మపోషకాలు అందించడం తప్పనిసరని చెన్నూర్ ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ సూచించారు.

జింక్: జింక్ లోపంతో విత్తనాలు విత్తిన మూడు వారాల తర్వాత మొక్క మధ్య ఆకులపై కనిపిస్తుంది. ఆకుల ఈనెలు, ఆకుపచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. గోధుమరంగు మచ్చలు ఆకుల చివర్ల నుంచి మొదలుకు వ్యాపిస్తాయి. ఆకుచివర్లు ఎండిపోతాయి. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి ముడతలు పడి కణుపుల మధ్య దూరం తగ్గిపోతుంది. మొక్కలు చిన్నవిగా గుబురుగా కనిపిస్తాయి.

నివారణ చర్యలు: జింక్ లోపం ఉండకుండా ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్‌సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్‌లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి ఐదు రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేయాలి.

బోరాన్: మొక్క జీవనక్రియలో బోరాన్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. మొక్కలో సున్నం, పొటాష్ పోషకాలను క్రమబద్ధీకరిస్తుంది. మొక్క సున్నాన్ని సక్రమంగా వినియోగించుకోవడానికి బోరాన్ అవసరం ఉంటుంది. సున్నంపాటు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితుల్లో అధిక వర్షపాతం ఉన్నప్పుడు ఈ లోపం కనిపిస్తుంది. ఆకులు, కాడలు ఒకే రీతిలో ఊడక కొంత దళసరిగాను, కొంత పలుచగాను ఉండి అక్కడక్కడ గుండ్రటి మచ్చలు ఏర్పడుతాయి. పూత, మొగ్గ దశలో ఎండిపోవడం, చిన్నకాయలు రాలిపోవడం మొక్కలు గిడసబారి మొదలుపై పగుళ్లు ఏర్పడుతాయి. కాండం సరిగా అభివృద్ధి చెందక ఆకారం కోల్పోయి, పగుళ్లు ఏర్పడుతాయి.

నివారణ చర్యలు: బోరాన్ లోపించకుండా ఉండేందుకు ఎకరాకు 4 కిలోల బోరాక్స్ దుక్కిలో వేయాలి. బోరాన్ లోపం మొక్కలపై కనిపిస్తే పైరు విత్తిన 60, 90 రోజుల తర్వాత లీటరు నీటికి 1.5 గ్రాముల బోరాక్స్ వారం వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేయాలి.

మెగ్నీషియం: ఈ దాతువు లోపం ఎక్కువగా సున్నపు నేలల్లో, పొటాష్ ఎక్కువగా ఉన్న నేలల్లో పండించే పంటలో కనిపిస్తుంది. మెగ్నీషియం లోపం పత్తిలో ఎక్కువగా ఉంటుంది. మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు ముదురు ఆకులు అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగులోకి మారుతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి.

నివారణ చర్యలు: మెగ్నీషియం లోపిస్తే లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి 45, 75 రోజులకోసారి పిచికారి చేయాలి. ప్రధాన పోషకాలు నత్రజని, పాస్ఫరస్, పొటాష్‌లు రైతులు ఏదో ఒక రూపంలో అందించాలి. దాని కంటే అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. సూక్ష్మ పోషకాల ఆవశ్యకత తెలియక రైతులు పురుగుమందులు వాడుతున్నారు. రైతులు వారి స్థాయిలో లోపాల లక్షణాలు గుర్తించి అన్ని ఎరువులు సమపాల్లో వాడితే పెట్టుబడి తగ్గి దిగుబడిని పెంచుకోవచ్చు.

శరన్నవరాత్రుల్లో పలు సేవలు రద్దు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శ్రీ శారదీయ శరన్నవరాత్రుల సందర్భంగా పలు సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 11 వరకు అభిషేకం, 9న అక్షరాభ్యాసములు తప్ప మిగతా అర్జిత సేవలు, వీఐపీ పాసులు, 11 నుంచి 13 వరకు చండీహోమం, 12న పూర్ణ హారతి, తదుపరి అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. భక్తులు సహకరించగలరని వారు కోరారు.

రేకుల షెడ్లు కూల్చివేత



షెడ్లను కూల్చివేసిన దృశ్యం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని చున్నంబట్టివాడలో గల ఉమర్‌మియా సొసైటీలో నిర్మించిన ఐదు రేకులషెడ్లను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. సొసైటీకి సంబంధించిన భూవివాదాల కారణంగా రెండు వర్గాలకు చెందిన వారు కోర్టుకు వెళ్లారు. ఈక్రమంలో రేకుల షెడ్లను కూల్చివేసిన సంఘటన కలకలం రేపింది. రాత్రి వేళ కూల్చివేతల వెనుక రెండు వర్గాల్లో ఎవరైనా ఉన్నారా, లేక ఇతరుల ప్రమేయం ఉందా లేదాని తెలియాల్సి ఉంది. కూల్చివేతలకు సంబంధించిన సమాచారం తెలియదని అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేత



ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటిని విడుదల

మంచిర్యాలరూరల్(హాజీపూర్) మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లఎత్తివేత కొనసాగుతోంది. 20 గేట్లను ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు 147.95 మీటర్ల నీటి మట్టం ఉండగా, మొత్తం 20.175 టీఎంసీలకు గాను 20.100 టీఎంసీల నీటిలు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కింద ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 1.35 లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తోందని తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 300 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, 20 గేట్ల నుంచి 1.30 లక్షల క్యూసెక్కులు గోదావరికి విడుదల చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసుల అత్యుత్సాహం

- ఒకరిపై లాఠీ ఝుళిపించిన పోలీసులు
- జిల్లా కేంద్రంలో ఘటన

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గౌతమినగర్‌కు చెందిన ఎండీ సాబీర్.. రంగంపేటలో ఎలక్ట్రీషియన్ వర్క్ చేసి ఆదివారం సాయంత్రం బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. బైపాస్‌రోడ్‌లో రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సాబీర్ రాగా, పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. ఆయన ఆగకుండా ముందుకెళ్లగా కానిస్టేబుల్ లాఠీని అడ్డుపెట్టగా అతని గొంతుకు తగిలి కింద పడిపోయాడు. సాబీర్‌ను పైకి లేపి లాఠీ ఝుళిపించారు. స్థానికులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా, లాఠీని అడ్డం పెట్టలేదు. చెయ్యితో ఆపేందుకు ప్రయత్నం చేయగా కిందపడిపోయాడని తెలిపారు.